మహబూబాబాద్
శుక్రవారం 24 నవంబర్ 2023




# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## కాంగ్రెస్ వస్తే కష్టాలు తప్పవు

చిన్నగూడూరు: ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నది. భూ సమస్యలన్నీ తీరిపోయినయ్. ఇప్పుడు కాంగ్రెస్ వస్తే మళ్లీ కష్టాలు తప్పవు. ధరణి తీసేస్తే మళ్ల భూ సమస్యలు వస్తయి. ఇదివరకు భూములు అమ్మినా, కొన్నా రిజిస్ట్రేషన్ కోసం రోజులకు రోజులు తిరిగేది. పనిపోయేది, డబ్బులు ఖర్చు అయ్యేది. ఇన్ని సమస్యలు అవసరమా? అలాంటి కాంగ్రెస్ మాకొద్దు. కేసీఆర్ ప్రభుత్వంలో సంతోషంగా ఉన్నం. సీఎం కేసీఆర్ ముందుచూపుతో మరెక్కడా లేని విధంగా ధరణి తీసుకొచ్చిండు. ఇప్పుడు ఎలాంటి సమ్యలు లేవు. భూమి కొనుగోలు చేసినా రైతు తహసీల్దార్ ఆఫీస్‌కు వెళ్తేనే నిమిషాల్లో రిజిస్ట్రేషన్ అవుతుంది. రైతుకు తెలవకుండా, అతని వేలిముద్ర లేనిదే ఆన్‌లైన్‌లో భూమిపై యాజమాన్య హక్కులు మారే పరిస్థితి లేదు. కాంగ్రెస్ పాలనలో నిరుపేదల భూములను ఉన్నతవర్గాల వారు పట్వారీలను తమ చేతుల్లో పెట్టుకొని రికార్డుల్లో పేరు మార్చి ఇబ్బందులకు గురి చేసేవారు. కాంగ్రెసోళ్లు ధరణిని తీసేస్తే మళ్లీ పాత రోజులు వచ్చి భూ వివాదాలు రోజురోజుకు ఎక్కువైతయ్.

**- ఎండీ ఇస్మాయిల్, రైతు, ఉగ్గంపల్లి, చిన్నగూడూరు**



## కాంగ్రెస్‌తో ఆగమే..

**ఆ పార్టీ వద్దు.. ఆ కష్టాలు వద్దు**

**రేవుకచ్చిన ఎవుసాన్ని ఖరాబు చేయద్దు**

- మూడు గంటల కరెంటు ఏ మూలకు సరిపోదు
- ధరణి వద్దంటున్న ఆ పార్టీని ఎవరూ నమ్మరు
- దళారుల రాజ్యం రానేవద్దు
- మునుపటి రోజులు చీకటి రోజులే
- స్పష్టం చేస్తున్న రైతులు, ప్రజలు
- అండగా ఉన్న బీఆర్ఎస్‌కే మద్దతంటూ జేజేలు

*'కాంగ్రెస్ హయాంల రాత్రింబవళ్లు కలిపి రైతులకు కరెంటిస్తే బావుల కాడనే కాపుగాసినం. సబ్ స్టేషనోళ్లకు ఫోన్‌జేసి కరెంటు ఎప్పడస్తదని అడిగితే మాకేం తెల్వదు.. పైననే పోయిందనేటోళ్లు.. రాత్రిపూట టార్చిలైట్లు పట్టుకొని బాయిల కాడికి పోయి నీళ్లు పారించినం. గంతెందుకు ఊళ్లె ఎవలన్న సచ్చిపోతె స్నానాలకు కూడా మోటరు వెట్టుదామంటే కరెంటు ఉండకపోవు' అంటున్నారు రైతులు. కాంగ్రెస్ పాలన అంతా చీకటి రోజులని, తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ పాలనలోనే తమ బతుకులు బాగుపడ్డాయని చెబుతున్నారు. నాడు ఎరువులు, విత్తనాల కోసం క్యూలో నిల్చునే పరిస్థితి ఉండేదని, ఇప్పడు దేనికీ బాధపడే పరిస్థితి లేదని అంటున్నారు. ధరణిని తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యమే వస్తదని, రోజురోజుకూ పంచాయితీలు పెరుగుతయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారు వల్లనే భూములకు విలువ పెరిగిందని, ఇప్పడు మళ్లీ రైతులను ఆగంజేసేందుకు కాంగ్రెస్ నాయకులు ఏవేవో మాట్లాడుతున్నారని మండిపడుతున్నారు. 'రైతుల గురించి ఏనాడూ ఆలోచించని కాంగ్రెస్ మాకెందుకు.. ఎప్పడూ మా శ్రేయస్సు కోరే కేసీఆరే మళ్లీ రావాలి' అని కుండబద్దలు కొడుతున్నారు.*

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 23**

## కాంగ్రెస్ అంటే అర్ధరాత్రి కరెంటు, పాముకాట్లే..

ఇనుగుర్తి: కాంగ్రెస్ పాలనలో ఎట్ల బతికినమో దేవునికే ఎరుక, మాకే ఎరుక. కాంగ్రెస్ పాలన అంటేనే అర్ధరాత్రి కరెంటు, పాముకాట్ల మరణాలు ఖాయం. కానీ తెలంగాణ తెచ్చిన కేసీఆర్ వచ్చిన దగ్గర నుంచి కరెంటుకు ఢోకా లేదు. ఇదే కరెంటు కోసం కాంగ్రెస్ హయాంలో ఎంత గోసపడ్డామో మరచిపోలేం. మూడుగంటల కరెంటు అంటే ఇదివరకు ఇచ్చినట్టు అర్ధరాత్రే ఇస్తరు. పగటి పూట కరెంటును మర్చిపోవాల్సిందే. అప్పట్ల మేము పొలానికి నీళ్లు పెట్టేందుకు పోయి కరెంటు ఎప్పుడు వస్తదో అని కావలి కాసేటోళ్లం. తీరా ఏ రాత్రి దాటినంకనో కరెంటు ఇస్తే రెండు, మూడు గంటల్ల తీసేటోళ్లు. ఒక్క మడి కూడా పూర్తిగా పారక పోయేది. దీంతో పంటలు ఎండిపోయేటియి. మళ్లీ ఇప్పుడు కాంగ్రెసోళ్లు వస్తే మళ్లీ అవే రోజులు వస్తయేమోనని భయమైతాంది. ఇప్పుడు సీఎం కేసీఆర్ 24గంటల కరెంటు ఇస్తుండు. పండుగలా వ్యవసాయం చేసుకుంటానం. కానీ ఇంతలో కాంగ్రెస్ నాయకులు వచ్చి మూడు గంటల కరెంటు,10హెచ్‌పీ మోటర్లు అంటే భయం భయంగా ఉంది. మా రైతులం అందరం కేసీఆర్‌తోనే ఉంటం.

**- బానోత్ బాలునాయక్, రైతు, మీట్యాతండా, ఇనుగుర్తి**





## కాంగ్రెస్‌కు ఓటేస్తే చిమ్మచీకట్లే

కురవి: కాంగ్రెస్ పార్టీ 50 ఏండ్లు పాలించి ప్రజలకు చేసింది ఏమీలేదు. ముఖ్యంగా రైతులను అరిగోస పెట్టిన్రు. కరెంటు లేదు.. సాగునీరు రాదు.. బోర్లు పడవు. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చినంక సీఎం కేసీఆర్ రైతుల కష్టాలన్నీ తీర్చిండు. ఈ తొమ్మిదేళ్లలో బీడు భూమి లేకుంట పోయిందంటే అర్థం చేసుకోవచ్చు. పచ్చకామెర్లు ఉన్నోడికి లోకమంతా పచ్చగా ఉన్నట్లు తయారైంది కాంగ్రెస్ పరిస్థితి. మూడు గంటల కరెంటు చాలనే నాయకులకు ఈ ఎన్నికల్లో రైతులు సరైన గుణపాఠం చెబుతారు. ఇయ్యాల రైతు గుండెమీద చేయి వేసుకొని నిద్రపోతున్నడంటే అది కేవలం కేసీఆర్ పుణ్యమే. మిషన్ కాకతీయ మొదలు రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు, కాళేశ్వరం నీళ్లు, మద్దతు ధర, కొనుగోలు కేంద్రాలు.. ఇవన్నీ రైతును బాగు చేసేందుకు దేశంలో ఏ రాష్ట్రంలో కూడ లేని రైతు భరోసా పథకాలే. రైతులందరం బీఆర్ఎస్‌కే ఓటు వేస్తం. 24గంటల కరెంట్ ఇస్తుంటే.. ఎటూ సరిపోని 3గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్‌కు ఓటు ఎవలేత్తరు. అస్సలే వేయరు. నేను మాత్రం బీఆర్ఎస్‌కే మద్దతు తెలుపుతున్న.

**- నూకల వేణుగోపాల్‌రెడ్డి, రైతు, మొగిలిచర్ల**

## ధరణి లేకపోతే రాబంధులతో కష్టం



కురవి: ఆంధ్రా పాలకులు రైతాంగాన్ని నట్టేట ముంచారు. ముందుగానే ఆలోచించి తెలంగాణలో ఒక్క ప్రాజెక్టు కూడ కట్టలేదు. సాగునీరు లేక భూములు నెర్రెలువారినయ్. రైతేడ్చిన రాజ్యం.. ఎద్దేడ్చిన ఎవుసం బాగుపడలేదని ఉత్తగనే అన్లేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రైతు సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడింది సీఎం కేసీఆరే. దేశంలోనే నిజమైన రైతుబాంధవుడాయనే. రైతు భూమిపై రైతుకే హక్కు ఉండాలని తీసుకొచ్చిన ధరణితో ప్రత్యేక భూ సంస్కరణ తెచ్చిన మహనీయుడు. మళ్లీ రైతాంగాన్ని ఆగం చేసేందుకే కాంగ్రెస్ కొత్త నాటకం మొదలుపెట్టింది. ధరణి లేకపోతే మళ్లీ పైరవీకారులు రాంబందుల్లెక్క పీక్కతింటరు. మళ్లీ రైతు వ్యవసాయం వదిలి ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తది. పచ్చగా ఉన్న రైతును చూసి కాంగ్రెస్ కళ్లలో నిప్పులు పోసుకుంటాంది. రైతులు కాంగ్రెస్ రంగుల ప్రపంచాన్ని చూసి మోసపోవద్దు. కరోనా వంటి మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేసినా రైతు వెన్నంటి ఉండి ధైర్యం చెప్పిన నాయకుడికి భరోసాగా నిలవాలి.

**- తోట లాలయ్య, రైతు, రాజోలు**

## దళారుల రాజ్యం వస్తది..



పెద్దవంగర: ధరణి తీసేసి బంగాళాఖాతంలో వేస్తమంటున్నరు. అంటే మళ్లీ దళారుల రాజ్యం వస్తది. రైతుల భూములను ఆగం చేయాలని చూస్తున్నరు. ఒకప్పుడు భూమి చేయించుకోవాలంటే చానా తిప్పలయ్యేది. దళారులను పట్టి, వాళ్లు అడిగినంత ఇస్తేనే పనయ్యేది. ఇంకా ఏదైన సమస్య వస్తే ఆఫీసుల చుట్టూ తిరిగితిరిగి ఆగమయ్యేది. కేసీఆర్ సర్కారు తెచ్చిన ధరణితో సమస్యలన్నీ తీరినయ్. మా మండల ఆఫీసులనే రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నం. మళ్లీ మాకు పాత కథ వద్దు.. ఇప్పుడున్న వ్యవస్థే కావాలి. మళ్ల కేసీఆర్ ప్రభుత్వమే వత్తది.

**- కూకట్ల వీరన్నయాదవ్, రైతు, పోచారం**




## గింత మంచిగున్నంక పాత పద్ధతి ఎందుకో?

ఇనుగుర్తి: సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చినంక రైతుల భూములు, వారి కాగితాలు అన్నీ భద్రంగా ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్‌సోళ్లు వచ్చి ధరణిని తీసేస్తే దారుణాలే జరుగుతై. గత కాంగ్రెస్ పాలనలో ఉన్న పటేళ్లు, పట్వారీలు మళ్లీ వస్తరు. రైతులను బానిసలుగా చూసి అందినకాడికి లాక్కుంటారు. భూములన్నీ పెద్దల పేరుమీద రాసుకుంటరు.



ఇదేందని అడిగిన రైతులను ముప్పుతిప్పలు పెట్టుతారు. పట్టా భూముల్లో అప్పుడున్న 56 పట్టికలు మళ్లీ తీసుకొస్తరు. అట్లజేస్తే భూముల గొడవలు, గెట్ల పంచాయితీలు మళ్లీ పెరుగుతయ్. కబ్జాలకు అడ్డూ అదుపు ఉండదు. దళారీ వ్యవస్థ పెరుగుతది. అందుకే గింత మంచి ధరణి పోర్టల్ ఉండగా.. పాత పద్ధతి ఎందుకు? కేవలం కాంగ్రెసోళ్ల స్వార్థం కోసమే ఇదంతా.. అందుకే కేసీఆర్ మళ్లీ గెలువాలె, ధరణి పోర్టల్ అలాగే ఉండాలె.

**- బైరు కొమురయ్య, రైతు, చిన్ననాగారం**

## బీఆర్ఎస్‌తోనే భద్రత



గూడూరు: ధరణి పోర్టల్‌తోనే మా భూములకు భద్రత ఉంటుంది. గతంలో భూములపై మాకు హక్కులు కావాలంటే సంవత్సరాల పాటు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, ఆర్ఐ, వీఆర్‌వోల వెంట తిరిగేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మా భూములకు మేమే బాసులం. సంతోషంగా ఏ రందీ, భయం లేకుంట వ్యవసాయం చేసుకుంటున్నం. బ్యాంకులో కూడా రుణాలకు వెళ్తున్నం. రైతు బంధుకు, ఉచిత కరెంట్‌కు ఢోకాలేదు. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి ధరణి తీసేస్తమంటున్నడు. ధరణి తీసివేస్తే మళ్లీ పెద్దపాము మింగినట్లే. గతంలో ఏ నాయకుడు, ఏ అధికారికి మొర పెట్టుకున్నా మా భూములను ఆన్‌లైన్ చేయలేదు. ఇప్పుడు మా భూమలు మా పేరునే ఉండి రికార్డులో తారుమారు కాకుండా ఉన్నయ్. ధరణి లేకుంటే మళ్లీ దళారీ వ్యవస్థ వస్తది. కాంగ్రెస్ పార్టీ వాళ్లు ధరణి తీసేస్తే రైతులకు గోస తప్పదు. పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే మా భూములకు రక్షణ ఉండదు. మళ్లీ వ్యవసాయం వదిలి పెట్టి అధికారుల చుట్టూ తిరగాలి. ఇన్ని కష్టాలు తెచ్చే కాంగ్రెస్ పార్టీని నమ్మం. బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నం. మళ్లీ అధికారంలోకి వచ్చేది కూడా సీఎం కేసీఆరే. సార్‌కే మా మద్దతు ఉంటది.

**- జలగం ప్రమోద్‌రావు, రైతు, మచ్చర్ల**



## 3 గంటల విద్యుత్ ఎలా సరిపోతుంది..?

బయ్యారం: ఎవుసం గురించి కాంగ్రెసోళ్లకు తెల్వదు కనకనే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుండ్రు. వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ ఎలా సరిపోతుంది..? ఒక్క మడి సుతా తడ్వదు.. మూడు గంటల కరెంటు ఇస్తే పంటలు ఎండాల్సిందే. నష్ట పోవాల్సిందే. రైతులు ఆగం కావాల్సిందే. కాంగ్రెస్ టీపీపీసీ అధ్యక్షుడు రేంవంత్‌రెడ్డి రైతుపై చులకనగా మాట్లాడడం సరికాదు. పంటలు భాగా పండాలంటే పుష్కలంగా నీరు ఉండాల్సిందే. ఇప్పుడు 24 గంటల కరెంటుతో రైతులు కావాల్సినప్పుడు చేనులకు నీరు కట్టుకుంటున్నారు. కాంగ్రెస్ పాలనలో ఎప్పుడు కరెంటు వస్తుందో తెలువక రైతులు పడిగాపులు కాస్తూ ఇబ్బంది పడే వారు. ఇప్పుడు గట్ల లేదు. దండిగా నీరు, దర్జాగా సాగు రైతులకు రంది లేదు. మా ఓటు కారు గుర్తుకే. మళ్ల కేసీఆర్ సార్ ప్రభుత్వమే వస్తది.

**- గుగులోత్ సురేశ్, రైతు, పెంకుతండా**



## 10 హెచ్‌పీ మోటర్లకు పైసలు ఎక్కడినుంచి తేవాలె..

చిన్నగూడూరు : కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ ఇస్తానంటున్నడు. 10 హెచ్‌పీ మోటర్లు కొనాలంటే చానా ఖర్చయితది. ఉన్న మోటర్లను పక్కకు పడేసి పెద్ద మోటర్లు తెచ్చుకునేందుకు అంత డబ్బు ఎక్కడినించి తేవాలి. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు కరెంటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిండు. 24గంటల కరెంటు ఇస్తాండు. కాంగ్రెస్ పాలనలో టార్చిలైట్లు, నెగడు పెట్టుకొని మోటర్ల దగ్గర కరెంటు కోసం ఎదురుచూసేటోళ్లం. పురుగుబూషి భయం ఉన్నా పంటలకు నీళ్లు పారించేందుకు రాత్రుళ్లు అవస్థలు పడ్డం. ఇప్పుడు 3గంటల కరెంటు సాలు అంటూ 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొమ్మని అంటున్నరు. రైతును అప్పులపాలు జేయడానికి కాంగ్రెసోళ్లు కుట్రలు చేత్తాండ్రు. వారి మాటలు నమ్మితే నిండా మునిగినట్టే. కేసీఆర్‌తోనే సాగు పనులు మంచిగుండి రైతులు బాగుపడుతున్నరు. కేసీఆర్ ప్రభుత్వమే రావాలె.. తప్పకుండ వస్తది. కేసీఆర్‌కే మా మద్దతు.

**- యాకూబ్, రైతు, చిన్నగూడూరు**

## 10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం కుదరదు

బయ్యారం: రైతులు 10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం చేయడం కుదరదు. వ్యవసాయం తెలిసిన వారు ఎవ్వరూ 10 హెచ్‌పీ మోటరు గురించి మాట్లాడరు. రైతులు వ్యవసాయానికి కేవలం 3, 5 హెచ్‌పీ మోటర్ల మాత్రమే వాడుతరు. రూ.50వేలలోపు ఖర్చుతో మోటరు, పైపులైన్లు తెచ్చుకోవచ్చు. 10 హెచ్‌పీ మోట్లరు బిగిస్తే రూ.లక్షకు పైగా ఖర్చు కావడమే కాకుండా కెపాసిటీకి తగినట్లుగా నీరు నీల్వలు ఉండవు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు కాలిపోతాయి. కరెంటు బిల్లు ఎక్కువ వస్తుంది. రైతులకు ఆర్థికభారం తప్పదు. 10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం చేయడం కంటే ఊకున్నది ఉత్తమం. బీఆర్ఎస్ ప్రభుత్వం 24గంటల కరెంట్ ఇస్తుంటే, కాంగ్రెసోళ్ల 3గంటల కరెంట్ మాకెందుకు. కేసీఆర్ ప్రభుత్వమే మాకు కావాలి. కారు గుర్తుకే ఓటు వేస్తం.

**- రఘుపతి, మోటర్ మెకానిక్, కొత్తపేట**

